క్లుప్తంగా

అధినేతకు ఆత్మీయ సత్కారం



ఘంటసాల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఘంటసాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి కొడాలి భక్తపాల్ గురువారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగనన్నను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం, ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ మేనేజర్ విజయ్ కుమార్, గుప్తా, కాంట్రాక్టర్ సైమన్ ఉన్నారు.

ఇంటర్మీడియెట్ పరీక్ష ప్రశాంతం

పెడన: ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటరులో 215 మంది విద్యార్థులకు గాను 206 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామారావు, డిపార్ట్‌మెంటు అధికారి మున్వర్ తెలిపారు. విజయానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 146 మందికి గాను 139 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ హిరణ్మయి, డిపార్ట్‌మెంట్ అధికారి నిజాముద్దీన్ తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ

వేకనూరు(అవనిగడ్డ): మండల పరిధిలోని వేకనూరులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సింహాద్రికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి ఆశీస్సులు అందజేశారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.8.86 లక్షలు

కృత్తివెన్ను: కృత్తివెన్నులోని శ్రీదుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.8,86,768 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం దేవదాయ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు సమక్షంలో హుండీని లెక్కించగా హుండీ ద్వారా రూ.3,64,310లు, అభిషేకాలు, ఆలయ దర్శనాలు, కానుకల ద్వారా రూ.5,22,458లు మొత్తం రూ.8,86,768 ఆదాయం వచ్చినట్లు వివరించారు.

పెడన మండలం నుంచి 17 ప్రాజెక్టులు ఎంపిక

పెడన: మండల పరిధిలోని ఇన్‌స్పైర్ మనక్‌కు పది పాఠశాలల నుంచి 17 ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికై నట్లు ఎంఈవో-2 వైవీ హరనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25వ విద్యా సంవత్సరానికి ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు ఆన్‌లైన్ ద్వారా గత ఏడాది పంపించారన్నారు. వీటిలో పెడన మండలంలోని పది పాఠశాలల నుంచి 17 ప్రాజెక్టులను ఎంపిక చేయడమే కాకుండా ఒక్కో విద్యార్థి ఖాతాకు నేరుగా రూ.10వేలు ప్రోత్సాహక నగదు జమ చేశారన్నారు. మండలం నుంచి ఉరివి -2 ప్రాజెక్టులు, విశ్వభారతి -3, వివేకానంద -4, నందిగామ-2, నందమూరు -1, బలిపర్రు గురుకులం -1, కొంకేపూడి -1, చేవేంద్ర -1, పెనుమల్లి -1, గొడపాలెం జింజేరు-1 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: బంటుమిల్లి పట్టణంలోని సెయింట్‌జాన్స్, కొమ్మారెడ్డి పాఠశాలల విద్యార్థులు ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రతినిధులు తెలిపారు. సెయింట్ జాన్స్ నుంచి ఎం.సాన్విక, జి.వర్షిణి, కొమ్మారెడ్డి పాఠశాల నుంచి కె.సాయిసుహాస్, కె.సాత్విక్ ఎంపికైనట్లు తెలిపారు.

కొనసాగిన ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రేవతి థియేటర్ సెంటర్ సమీపంలోని ఫైర్ స్టేషన్ పక్కన ఈడేపల్లి డ్రెయిన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీ కొట్లను గురువారం తొలగించారు. పోలీసు పహారా నడుమ జేసీబీ, క్రేన్‌ల సాయంతో బడ్డీలను తొలగించారు. వలందపాలెంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలను కూడా తొలగించారు. తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరిప్రసాద్ పర్యవేక్షించారు. ఏళ్ల తరబడి ఈ ప్రాంతంలో బడ్డీలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు ఈ బడ్డీల తొలగింపుతో ఉపాధి కోల్పోయారు. జీవనోపాధి కోల్పోయిన తమకు ప్రభుత్వమే ప్రత్యామ్నాయం చూపాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

పేదలపై జులుం...పెద్దలపై మౌనం..!

- బడా బాబుల ఆక్రమణలపై చర్యలేవి?
- భవనాల మార్జిన్లపై నోటీసులతో సరి
- నోటీసులు జారీ చేసి నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం

పొట్ట కూటి కోసం రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే సామాన్యుల పైనే అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారు తప్ప బడా బాబుల జోలికి పోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు కడుతున్నా అటుగా కన్నెత్తి చూడరు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. చిరు వ్యాపారులు వేసుకున్న పాకలు, పందిళ్లు రాత్రికి రాత్రి పీకేసి ఆక్రమణలు తొలగించామంటూ గొప్పలు చెప్పుకుంటూ పట్టణ ప్రజానీకానికి హీరోల్లా ఫోజులిస్తారు. కాని పట్టణంలో అనధికార లే అవుట్లు వేసినా, భవనాలు అతిక్రమించి రోడ్డు మార్జిన్ల వరకు కట్టినా వాటి జోలికి పోయే సాహసం మాత్రం చేయరు.



పెడన చేపల మార్కెట్ వద్ద భవనంపై భాగం విద్యుత్ స్తంభాన్ని ఆనుకుని కట్టిన వైనం(వలయంలో)

పెడన: పెడన - మచిలీపట్నం ప్రధాన రహదారిలోని రైలు గేటు సమీపంలో చిన్నపాటి పాకను వేసుకుని వ్యాపారం చేసుకునేందుకు చిరువ్యాపారి ఒకరు ఇటీవల రాత్రికి రాత్రి కర్రలు పాతి పాకను ఏర్పాటు చేసుకున్నాడు. మున్సిపల్ అధికారులు దానిని ఆగమేఘాలపై తొలగించారు. శానిటేషన్ సిబ్బంది ఆ పాకను ఊడదీయడమే కాకుండా కర్రలను సైతం ట్రాక్టర్‌లో వేసి తీసుకుపోయారు. ఇదే అధికారులు, సిబ్బంది అనధికార లే అవుట్లలో తొలగించిన రాళ్లను ట్రాక్టర్లలో తీసుకుపోయే ధైర్యం లేక అక్కడే వదిలివెళ్లారు. మళ్లీ ఆ లేఅవుట్‌లో రాళ్లను లే అవుట్ యజమానులు పాతిపెట్టుకునేలా ఒప్పందాలు చేసుకుంటున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

విద్యుత్ స్తంభాన్ని ఆనుకుని భవన నిర్మాణం

బంటుమిల్లి రోడ్డులోని చేపల మార్కెట్ వద్ద ఓ భవనం నిబంధనలకు విరుద్ధంగా కట్టారు. భవనం పైన మార్జిన్ ఏకంగా విద్యుత్ తీగలను ఆనుకుని ఉన్నట్టుగా నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ అధికారులు ఆ విషయమై ప్రశ్నిస్తే వారిపై ఎదురుతిరిగిన పరిస్థితి. దీంతో నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవగా సదరు భవనం తాలూకా వారు నోటీసులు కూడా తీసుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే పీఏ సిఫార్సులతో దీనిని కప్పిపుచ్చేందుకు విశ్వప్రయత్నాలు ప్రారంభించారు. ఏదైనా పొరపాటున విద్యుదాఘాతం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నోటీసులు జారీ చేస్తామని చెప్పి తప్పించుకుంటున్నారు. పట్టణంలో గూడూరు రోడ్డులో కూడా ఇటువంటి ఆక్రమణలు చాలా ఉన్నాయి. వీటిపై దృష్టి పెట్టి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పెడన-మచిలీపట్నం రోడ్డులో ఆక్రమణలు తొలగించి ఆ సామగ్రిని ట్రాక్టర్‌పై వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నోటీసులు తీసుకోకపోతే పోస్టు ద్వారా పంపిస్తాం



చేపల మార్కెట్ వద్ద భవనం పైభాగం బాగా ముందుకు విస్తరించారు. ఈ విషయమై సదరు భవన యజమానికి నోటీసులు జారీ చేయాలని ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించాం. వారు వెళితే నోటీసులు తీసుకోలేదు. పోస్టు ద్వారా నోటీసులు జారీ చేస్తాం. ఆ నోటీసులకు కూడా స్పందించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– బి.సుజనకుమారి, టౌన్ ప్లానింగ్ అధికారి, పెడన మున్సిపాలిటీ

నేడు, రేపు యోగాసన పోటీలు

అవనిగడ్డ: ఈనెల 7, 8 తేదీల్లో స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు కళాశాల కరస్పాండెంట్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ దుట్టా ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిట్ ఇండియా ఉమెన్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో భాగంగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7, 8 తేదీల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉత్తానసనం, వృష్టాసనం, వక్రాసనం, వృక్షాసనం, ఉత్తాన పాదాసనం విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 10 సంవత్సరాల వయస్సు నుంచి 55 సంవత్సరాల వయస్సున్న మహిళలకు ఆరు కేటగిరిలలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు 94906 07421 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

యూత్ పార్లమెంట్‌కు యువత తరలాలి

కోనేరుసెంటర్: గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీలలో జరిగే యూత్ పార్లమెంట్‌లో పాల్గొనేందుకు యువత సన్నద్ధం కావాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి పిలుపునిచ్చారు. ఇందుకోసం ఈ నెల 9 వ తేదీ లోపు మై భారత్ పోర్టల్ లో వికసిత భారత్ అనే అంశంపై ఒక నిమిషం నిడివి గల వీడియో రూపొందించి అప్లోడ్ చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ

చల్లపల్లి: మండల పరిధిలోని పాగోలులో ఉన్న ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ, విశ్రాంత డీజీపీ కె.రాజేంద్రకుమార్ గురువారం సందర్శించారు. ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులను పలకరించారు. పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులపై ఆరా తీశారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. రానున్న పరీక్షల్లో ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదవ తరగతి అనంతరం ఉన్నత చదువులు, జీవిత ఆశయాలను గురించి పిల్లలతో ముచ్చటించారు. అనంతరం భోజనశాలను, స్టోర్‌లో సరుకులను, వంట ఏజెన్సీ పనితీరుపై ఆరాతీశారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట స్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదనరావు ఉన్నారు.



ఎన్టీఆర్ మోడల్ స్కూల్లో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ట్రస్ట్ సీఈఓ రాజేంద్రకుమార్

గ్రామ నమూనాల ప్రదర్శన



వెంకటాపురం(మోపిదేవి): మండల కేంద్రం మోపిదేవి, వెంకటాపురం గ్రామాల నమూనాలను బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం ప్రదర్శించారు. ఘంటసాల కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.సుధారాణి గ్రామ చిత్రపటాలను పరిశీలించి, గ్రామంలో పంటల సాగు సరళి, పంటలలో మెలకువలను విద్యార్థులకు, రైతులకు వివరించారు. కౌలు రైతులు, చిన్నకారు రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతో పాటు గ్రామంలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నవీన్, డాక్టర్ రేవతితో పాటు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కంఠంనేని కుటుంబరావు, ఆదర్శ రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవ నిర్వాహకులకు సత్కారం

పెడన: పట్టణంలోని బ్రహ్మపురంలో ఇటీవల జరిగిన శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్మహోత్సవాలకు సంబంధించి ఉత్సవాలను దిగ్విజయంగా జయప్రదం చేయడంలో కీలకపాత్ర పోషించిన ప్రముఖులకు గురువారం చిరుసత్కారం చేశారు. బ్రహ్మపురంలోని శ్రీరామలింగ చౌడేశ్వరి ఆలయంలో జరిగిన జ్యోతిర్మహోత్సవాల జమ-ఖర్చుల సమావేశం అనంతరం కమిటీని ఏకతాటిపై నడిపించి అనేక సూచనలు, సలహాలు ఇచ్చి జయప్రదం కావడంలో కీలక పాత్ర పోషించిన బొడ్డు దీక్షానందుడు, ఉత్సవ కమిటీ కన్వీనర్ యక్కాల శ్యామలరావులను ఘనంగా సత్కరించారు. ఉత్సవాల సందర్భంగా పార్కును సైతం ఒక కళాఖండంగా తీర్చిదిద్ది చలువ పందిర్లను జనాకర్షణగా, వైభవోపేతంగా తీర్చిదిద్దిన పేరిశెట్టి శ్యామలరావు, పేరక ఓంకుమార్‌లను కూడా సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మపురం పెద్దలు పిచ్చుక కోటేశ్వరరావు, పులి సాంబశివరావు, ఊట్ల వాసుదేవరావు, ఓంకారం, బల్ల గురూ, పైడేశ్వరరావు, యర్రలింగం, బొడ్డు ఆనందరావు, బొడ్డు అమర్ నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల పునః ప్రతిష్ఠ

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి కురుమవీధిలో జీర్ణోద్ధరణ చేసిన శ్రీ అయోధ్య రామ, బీరప్ప స్వామి ఆలయ, దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఘనపాఠి, ఆయన శిష్య బృందం బ్రహ్మత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిచారు. ప్రతిష్ఠా కార్యక్రమాన్ని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి

- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ
- రుద్రవరం గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనుల పరిశీలన

కోనేరుసెంటర్: గృహాల నుంచి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బందరు మండలం రుద్రవరం గ్రామంలో గురువారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు వేరుగా ఇవ్వని యజమానులపై అవసరమైతే చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడ వద్దన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన చెత్తను కుప్పగా పోసి తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. భూమిలో కలిసిపోయే కూరగాయల వ్యర్థాలు, పండ్ల తొక్కలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక బుట్టలో వేయాలని, తిరిగి వినియోగించుకునేందుకు ఉపయోగపడే కాగితాలు, అట్టలు గాజు, ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలు, ఇనుప ముక్కలు మరో బుట్టలో వేయాలని గృహ యజమానులకు చెప్పాలన్నారు. తడి చెత్తను స్థానికంగా ఉండే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) కు తరలిస్తే వర్మి కంపోస్ట్ తయారీ, అమ్మకాల ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ తెలిపారు.



రుద్రవరం గ్రామంలో తడి, పొడి చెత్తను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాలాజీ

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): విలువ ఆధారిత ఉత్పత్తులు నేర్చుకుని మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తెలిపారు. మండలంలోని ఉత్తర చిరువోలులంకలో చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో డాక్టర్ సుధారాణి చేప కట్లెట్, చేప ఫింగర్స్ తయారు చేసి చూపించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి చేపలు, రొయ్యలలో ఉండే పోషకాలు వివరించి, వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్, డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

కేయూ ఉపకులపతి రాంజీ

కోనేరుసెంటర్: ప్రజలు ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ హితవు పలికారు. సొంత ఆస్తులను ఎంత జాగ్రత్తగా కాపాడుకుంటామో ప్రజలకు చెందిన ప్రభుత్వ ఆస్తులను అంతే జాగ్రత్తగా రక్షించుకోవాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ఏర్పాటు చేసిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, జాతీయ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఆచార్య ఎస్.రామకృష్ణారావు పర్యావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావును ఉపకులపతి ఆచార్య కూన రాంజీ దుశ్శాలువతో సత్కరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ రాంజీ

మొక్కలు నాటిన సర్పంచ్ విజయ్‌కుమార్

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ మొక్కలు నాటారు. సాయిబాబు గుడి మలుపు వద్ద అందరూ చెత్త వేస్తుండటంతో అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా తయారైంది. సర్పంచ్ విజయ్‌కుమార్ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

కంకర గుట్టను తొలగించారు



కంకరగుట్ట తొలగించడంతో విశాలంగా ఉన్న మలుపు (నేడు)



కంకర గుట్ట వల్ల మలుపు వద్ద మూసుకుపోయిన రహదారి(నాడు)

అవనిగడ్డ: అవనిగడ్డ – నాగాయలంక ప్రధాన రహదారిపై స్థానిక జెడ్పీ హైస్కూల్ మలుపు వద్ద ఉన్న కంకరగుట్టను ఎట్టకేలకు తొలగించారు. మలుపు వద్ద మూడు నెలల క్రితం పోసిన ఈ కంకర గుట్ట కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిపై ఈనెల 3వ

సాక్షి ఎఫెక్ట్

తేదీన 'సాక్షి'లో ''ప్రమాదకరంగా కంకరగుట్ట'' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎస్ఐ శ్రీనివాస్ గురువారం ఈ గుట్టను తొలగింపజేశారు.

నాంచారమ్మ తిరునాళ్లకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం
- లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ చెప్పారు. ఈ నెల 13,14 తేదీల్లో జరిగే అమ్మవారి తిరునాళ్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో గురువారం ఆలయ ప్రాంగణం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమ్మవారి పుట్టింటివారిగా పిలవబడే గుంటూరు, ప్రకాశం, ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల పాటు సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉండడంతో వీరికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలపై పలు ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్ఐ చాణిక్య తెలిపారు. 150 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని వి.కొత్తపాలెం మీదగా వాహనాలు అనుమతించి, తిరుగు ప్రయాణం కోడూరు మీదగా పంపనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ఘాట్లలో పుణ్యస్నానాలు

కృష్ణానది వద్ద రెండు ఘాట్లలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు చెప్పారు. బారికేడింగ్‌తో పాటు ఐదు మరబోట్లు, 12 మంది గజఈతగాళ్లతో గస్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. 40 మంది పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులను చేపట్టడంతో పాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను నిర్మిస్తామని ఈవోపీఆర్డీ నాగరేవతి చెప్పారు. విశ్వనాథపల్లి స్పెషల్ పేరుతో అవనిగడ్డ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు దేవదాయ అధికారి జయశ్రీ తెలిపారు. అనంతరం జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. సర్పంచి కొప్పనాతి శేషుబాబు, ఆర్ఐ సుభాషిణి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనునాయక్

వైభవంగా భావనారుషి స్వామి కల్యాణం

ఘంటసాల: ఘంటసాల గోటకం కాలనీలో శ్రీ భద్రావతీదేవి శ్రీ భావనారుషి స్వామి వార్ల 35వ కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. గోటకం పద్మశాలీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో అర్చకుడు ఆకురాతి పాపారావు సమక్షంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా రావిరాల శ్రీనివాసరావు - హేమలత దంపతులు పీటలపై కూర్చుని స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రాత్రి స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

భావనారుషి స్వామి ఆలయ ముఖమండపం స్టీల్ గ్రిల్ ఏర్పాటుకు బెంగళూరుకు చెందిన అంది లీలా కృష్ణ,శారదారాణి దంపతులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

గూడూరు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గూడూరు ఎస్ఐ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోలీసుల పనితీరుపై అవగాహన కల్పించారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సమయంలో పోలీసులు స్పందించే విధానం, సమాజంలో నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర, పోలీసు కమ్యూనికేషన్, పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, నేరస్తులను బంధించే లాకప్ రూములపై బాలికలకు అవగాహన కల్పించారు. సమాజంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఏమైనా సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని బాలికలను కోరారు.

తిరుపతమ్మ అమ్మవారికి నవవిధ అభిషేకాలు

కోడూరు: విశ్వనాథపల్లిలో కృష్ణానది సమీపంలో ఉన్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి గురువారం నవవిధ అభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ నిర్మాణం జరిగి 26 సంవత్సరాలు పూర్తి కావడంతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలను జరిపారు. గోపయ్య, లక్ష్మీ తిరుపతమ్మ పంచలోహ నూతన ఉత్సవ విగ్రహాలను సిద్దినేని అశోక్‌నాయుడు, కోట రాంబాబు ఆలయ కమిటీకి అందించారు. పంచలోహ విగ్రహాలు బహూకరించిన దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు. వేదపండితులు సూర్యనారాయణ, గోపి స్వామివార్ల విగ్రహాలకు సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం శాంతి కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. పోతురాజు శిలలతో పాటు శిఖర ప్రతిష్ఠను కూడా శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్నసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వామివార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు